క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కిశోర బాలికలు, మహిళలు ఆరోగ్యం కోసం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ కృష్ణా పార్కు సెక్టార్ ప్రాజెక్టు పర్యవేక్షకురాలు పి.సీ తామహలక్ష్మి సూచించారు. కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని పుణ్యపువీధి, మెర్జెడీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతామహలక్ష్మి మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో ఏమైనా సమస్యలుంటే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే రత్నకుమారి, కార్యకర్తలు సంధ్యారాణి, పైడి రాజు, రాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ పున్నయ్య

ఎచ్చెర్ల: మండలంలో ప్రస్తుతం జరుగుతున్న నాడు–నేడు పనులను పూర్తిచేయాలని ఎంఈఓ కారు పున్నయ్య తెలిపారు. మండల కేంద్రంలో నాడు–నేడు స్కూళ్లకు సంబంధించిన హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. పనులు ఏ స్థాయిలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ జి.రాజ కిశోర్, ఏఈ సూర్యచంద్ర, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ లక్ష్మీడిపేట గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. ఈ నెల 4వ తేదీ నుంచి తల్లీ, కుమార్తెలు కనిపించడం లేదని ఫరీదుపేట గ్రామానికి చెందిన వివాహిత తండ్రి ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయులకు ఘన నివాళి



నెహ్రూ, కందుకూరి చిత్రపటాలకు పూల మాలలు వేస్తున్న సాయికుమార్

రణస్థలం: దేశ తొలి ప్రధానమంత్రి, భారతరత్న జవహర్‌లాల్ నెహ్రూ, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతిని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు చినరామినాయుడు, ఆనందపాత్రుడు, మహంతి సత్యనారాయణ, గొర్లె రామునాయుడు, కరిమజ్జి రమణ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో మెలకువలు పాటించాలి



శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ శంకరరావు

ఎచ్చెర్ల: ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గణితంలో మెలకువలను పాటించాలని రిసోర్స్‌పర్సన్ ఎం.శంకరరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం లావేరుశాఖ గ్రంథాలయంలో గణితంపై విద్యార్థులకు బోధించారు. ప్రాచీన సంఖ్యానామాలు, వర్గమూలాలు, కూడికలు, తీసివేతలు, త్రిభుజములు, దీర్ఘచతురస్రం, కొలతలు, కొలమానం, గణితశాస్త్ర వేత్తల జీవితాల గురించి వివరించారు. లెక్కలు గురించి భయపడకూడదన్నారు. గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి మృతికి సంతాపం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశ్రాంత న్యాయమూర్తి, మాజీ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, రేరా యాక్ట్ రాష్ట్ర ఎడ్యుకేటింగ్ న్యాయధికారి వి.మోహన్ కుమార్ అకాల మృతికి రాష్ట్ర టీస్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సంఘం సంతాపం తెలియజేసింది. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. దీంతో కోర్టులోని ప్రభుత్వ న్యాయవాదులు సోమ వారం సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రుచికరమైన భోజనాలను వండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వేంకటేశ్వరరావు



మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని తెలియజేస్తున్న ఆర్పీ రాము

ఇచ్ఛాపురం రూరల్: సర్కారు బడుల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనాలను నిర్వాహకులు రుచికరంగా వండాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వేంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ విద్యార్థి బడిలోనే భోజనం చేసే విధంగా విద్యార్థులకు పోషకారం అందించేందుకు మరింత శ్రద్ధ వహించాలన్నారు. వంట పాత్రలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. 69 పాఠశాలలు నుంచి వచ్చిన నిర్వాహకులతో ఆయన నేరుగా మాట్లాడారు. ఎంఈవో కురమాన అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీఎం జిల్లా ప్రత్యేక శిక్షకులు యు.రాము భోజనాలు తయారీ చేసే విధానం, మెనూపై శిక్షణ ఇచ్చారు.

వైభవంగా అసిరిపోలమ్మ సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



వీధినాటక వేషధారణలు

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరి పోలమ్మ అమ్మవారి సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారిని మేళతాళాలతో గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పౌరాణిక ఘట్టాల రథాలు, వీధి నాటకాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చివరి మూడురోజులు కావడంతో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.



సూర్య భగవానుడి విగ్రహం



ఆకట్టుకుంటున్న ఈశ్వరుని రథం

పరిశుభ్రత పాటించాలి

ఎచ్చెర్ల: మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలని ఎండీఎం ఏడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎంఈఓ మజ్జి మురళీకృష్ణ అధ్యక్షతన లావేరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వంటల పోటీలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం సిబ్బంది డి.కూర్మారావు, శిక్షకులు కె.సుశీల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కంచమ్మతల్లి చల్లదనం



కంచిలి: స్థానిక ప్రజల ఆరాధ్య దేవత కంచమ్మ తల్లి చల్లదనం మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని మొదట రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్నటువంటి ఉత్సవ స్థానం నుంచి మెయిన్‌రోడ్డులో ఎస్‌ఆర్‌సీపురం వైపు కేశవరావు దాబా హోటల్ కూడలి వరకు వెళ్లి, అటునుంచి మళ్లీ మెయిన్ రోడ్డు మీదుగా మఠం కంచిలి వరకు ఊరేగింపు చేపట్టడానికి నిర్ణయించారు. అమ్మవారిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి అమ్మవారి దత్తత గ్రామాల భక్తులంతా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ఊపందుకున్న ఉపాధి పనులు



వజ్రపుకొత్తూరులో జరుగుతున్న ఉపాధి పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను నివారించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఉపాధి పనులు ఊపందుకున్నాయి. మండలంలోని సీతాపుర, పెద్దబొడ్డపాడు, కొండవూరు, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు, పీఎంపురం, రాజాం, పల్లివూరు, కిడిసింగి, శారదపురం, తాడివాడ, రామకృష్ణపురం, పాతటెక్కలి తదితర గ్రామా ల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి మండలంలో 3,400 మంది వేతనదారులు పలు రకాలు పనుల్లో పాల్గొంటున్నారు.

తాగునీటి సరఫరా బంద్



మరమ్మతులు జరుగుతున్న పైపులైన్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం పురపాలక సంఘం పరిధిలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు మున్సిపల్ తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ 3వ బావి వద్ద మెయిన్ పంపింగ్ పైపులైన్ మరమ్మతులకు గురవ్వడంతో తాత్కాలికంగా పంపింగ్ ఆపివేయడం జరిగిందన్నారు. నీటి సరఫరా నిలిపివేయబడిన ప్రాంతాల్లో అద్దె ట్యాంకర్లతో సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అంతరాయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాను



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



హాజరైన పలాస నియోజకవర్గ శ్రేణులు

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందని, తనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మరికొద్ది రోజుల్లో ఘన విజయం సాధించి ప్రభుత్వ నిర్మాణం చేస్తామన్నారు. మనల్ని నమ్ముకున్న ప్రజలకు సేవచేసే భాగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టి

వజ్రపుకొత్తూరు: పంచాయతీల్లో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా తడి, పొడి చెత్తతో సంపద సృష్టించవచ్చునని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. మండలంలోని పాతటెక్కలి గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి కంపోస్టు ఎరువు తయారీ చేసి, వాటిని వ్యవసాయం, కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ఎరువుగా సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తడి, పొడి చెత్తను ఉంచే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ మధుబాబు, వీఆర్వో గాలి రవి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వజ్రపుకొత్తూరు: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామారావు



కాశీబుగ్గ: గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ రాధిక

● ఎస్పీ జీఆర్ రాధిక

కాశీబుగ్గ: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జీఆర్ రాధిక హెచ్చరించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చిన్నబడాం గ్రామంలో సోమవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఇటీవల ఎన్నికల అనంతరం జరిగిన చిన్నపాటి ఘర్షణలకు ఇరువర్గాలకు చెందిన పలువురుపై బైండోవర్ కేసులు నమోదు చేసిన విషయాలు ప్రస్తావించారు. ఓట్లు లెక్కింపు దగ్గర పడుతున్న తరుణంలో గ్రామంలో ఎవరైనా గలాటా చేస్తే సహించేది లేదన్నారు. ఆమెతో పాటు డీఎస్పీ నాగేశ్వర రెడ్డి, సీఐ విజయ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: కౌంటింగ్ సమయంలో వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సీహెచ్ రామారావు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొత్తపేట, దేవునల్తాడ గ్రామస్తులతో శాంతిభద్రతలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో ప్రతీ ఒక్కరూ అన్నదమ్ముల్లా మెలగాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు పేల్చడం ఎన్నికల ఫలితాలు అనంతరం కూడా నిషేధమని స్పష్టం చేశారు. ఆయనతో పాటు స్థానిక పోలీసులు ఉన్నారు.

20 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు

కంచిలి: మండలంలో 20 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రంలో మఠం కంచిలి గ్రామంలో ఒక బాలుడిని సోమవారం గుర్తించారు. ఈ అబ్బాయికి స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీలు అవసరమన్నారు. త్వరలో ఈ సేవలు, ఉపకరణాలు అందించాల్సిందిగా భవిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీలక్ష్మి, భవిత ఐఈఆర్‌టీలు టి.చంద్రశేఖర్, నిర్మల పాల్గొన్నారు.

• విద్యార్థులకు అవగాహన



మండల పరిధిలోని తండేవలస గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం పనితీరుపై నైరా వ్యవసాయశాఖ విద్యార్థులకు ఒక్కరోజు అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, విధానాలు, రైతులకు అందజేసే సేవలు, స్కీములపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నంనాయుడు, మండల వ్యవసాయాధికారి ఉషకుమారి పాల్గొన్నారు.
- శ్రీకాకుళం రూరల్

జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



రామచంద్రరావును అభినందిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావును రిమ్స్ సత్యసాయి అన్నపూర్ణ పథకం ప్రతినిధులు ఘనంగా సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా రిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో అన్నపూర్ణ పథకం అధ్యక్షుడు గంగుల రమణబాబు మాట్లాడుతూ జిల్లాలో సత్యసాయి సంస్థల సేవలు మరింతగా పెరిగే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ అందరి సహకారంతో సేవలు పెంపు చేస్తామన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావు, జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జి పప్పల నాగేశ్వరరావు, కృష్ణారావు, ఐ.రాము, సాయిబాబా, శ్రీనివాస్, చంటి, రమణమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జవహర్ లాల్ నెహ్రూ



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: భారతదేశ ప్రధానమంత్రిగా వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతికి కృషి చేసిన ఆదర్శనీయుడు దివంగత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందాలని నెహ్రూ కృషి చేశారన్నారు. కార్పొరేట్, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు పాటుపడ్డారని పేర్కొన్నారు. నెహ్రూ కలలను నిజం చేసేందుకు ప్రస్తుతం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, గోవింద మల్లిబాబు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, దంత త్రినాథరావు, అంబటి దాలినాయుడు, కె.వెంకట్రావు, జి.ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి పాదాలకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీపన్నాయుడుపేట గ్రామంలో కొలువైన చెవిటమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అలాగే అమ్మవారి పాదాలకు ముగ్రాటలు సమర్పించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందించారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు



సోంపేట: పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో వేంకటేశ్వరరావు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మండల కేంద్రాల్లోని ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు సోమవారం పరిశీలించారు. ఆయనతో పాటు సమగ్ర శిక్ష సిబ్బంది ఉన్నారు.

సోంపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు సోమవారం చేరుకున్నాయని విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు తెలియజేశారు. స్టాక్ పాయింట్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.వేంకటేశ్వరరావు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు మాట్లాడుతూ 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 15,793 పాఠ్య పుస్తకాలు, 42,180 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన తరగతుల పాఠ్య పుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చేరుకుంటాయని తెలిపారు. పలువురు విద్యా వనరుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఏఎస్‌ఎం ఉషారాణి అన్నారు. ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండపల్లి గ్రామంలో కిశోర బాలికలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే మంచి సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నెలసరి సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలని, దాని వలన ఋతుస్రావం సమయంలో వచ్చే నష్టాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బర్రి నరసమ్మ, కె.జ్యోతి, కె.సునీత, జి.జ్యోతి, ఎస్.శారద, ఎం.జ్యోతి, పి.లలిత, ఆశావర్కర్లు పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.